క్లుప్తంగా

శాకంబరి అవతారంలో ఉమామహేశ్వరీ దేవి


పలు రకాల కూరగాయల అలంకరణలో అమ్మవారు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరీ దేవి అమ్మవారు శాకంబరి అవతారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి అత్యంత ఇష్టమైన రోజు కావడంతో అమ్మవారిని భక్తులు వివిధ రకాల కాయగూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు చంద్రమౌళి వెంకట సూర్యనారాయణమూర్తి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. శాకంబరి అవతారంలో అమ్మవారిని భక్తులు దర్శించుకొని పులకించిపోయారు. పంటలు మంచి దిగుబడి సాధించాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని లోక కళ్యాణార్థం అమ్మవారు శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారని అర్చకుడు తెలిపారు.

సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే


కేజీహెచ్‌లో సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మాకవరపాలెం మండలం తాడపాల సర్పంచ్ లక్కరాజు మౌనికను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాసరావు తండ్రిని పరామర్శించారు.

శ్మశాన వాటిక రోడ్డు పనులు ప్రారంభం


కొబ్బరికాయ కొడుతున్న రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టరు గొల్లవిల్లి ప్రభావతి

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో శ్మశాన వాటిక వైపు రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులకు రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టరు గొల్లవిల్లి ప్రభావతి కొబ్బరికాయ కొట్టి శుక్రవారం ప్రారంభించారు. గడప గడప కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షల మంజూరు చేశారని, 75 మీటర్ల మేర రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేశ్, వార్డు సభ్యుడు పోతిన జగదీశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

దేవరాపల్లి: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గ్రామ మహిళా సంరక్షణ అధికారి గొర్లె వరలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, దిశ యాప్, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై ఆమె సమగ్రంగా వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రీ సర్వేతో శాశ్వత భూ హక్కు

మాకవరపాలెం: రీ సర్వేతో రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు దక్కుతాయని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తామరంలో రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లో రీసర్వే ప్రారంభిస్తామన్నారు. రైతులంతా తమ భూములకు సంబంధించిన పత్రాలు, ఆధార్ కార్డులు, ఫొటోలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, డీటీ కృష్ణమూర్తి, వీఆర్వో సూకరాజు పాల్గొన్నారు.

తండ్రీ తనయుల హయాంలోనే.. 'నాతవరం'

ఎన్నికల సమయంలో హామీలివ్వడం కాదు... వాటిని నెరవేర్చడంలోనూ తండ్రీతనయులు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారు. వీరి ఏలుబడిలో పేదలకు పక్కా ఇల్లు కల నెరవేరింది. నాడు ఇందిరమ్మ కాలనీ, నేడు జగనన్న కాలనీ ఏర్పాటుతో పట్టణ ప్రాంతంగా నాతవరం రూపాంతరం చెందుతోంది.

- నాడు ఇందిరమ్మ కాలనీ.. నేడు జగనన్న కాలనీ ఏర్పాటు
- వైఎస్సార్, జగన్ పాలనలోనే అందరికీ పక్కా ఇళ్లు
- పేదల హృదయాల్లో సుస్థిరమైన స్థానం


జగనన్న లేఅవుట్లలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు


నాతవరంలో ఇందిరమ్మ మోడల్ కాలనీ

నాతవరం: రాజకీయాలకు అతీతంగా పేదలకు స్థలాలతోపాటు కొత్తగా ఇళ్లు ఇచ్చిన ఘనత మహానేత రాజశేఖర్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకే దక్కింది. నాతవరం పంచాయతీలో 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ పథకంలో భాగంగా 850 ఇళ్లు మంజూరు చేశారు. అందులో దారిద్ర్యరేఖ దిగువున్న పేదలకు వీటిని కేటాయించగా, స్థలాలు లేక నిర్మించుకోలేదు. దీంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో 268 మంది పేదలకు రెండు సెంట్లు చొప్పున స్థలాలిచ్చి హౌసింగ్ కాలనీ నిర్మించారు. అప్పట్లో కాలనీ వాసులు దీనికి ఇందిరమ్మ మోడల్ కాలనీగా నామకరణం చేసుకున్నారు. ఇప్పుడిది పట్టణ ప్రాంతాన్ని తలపించేలా దర్శనమిస్తోంది.

జగనన్న లేఅవుట్‌లో...

తండ్రి ఒకడుగు వేస్తే తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి నాతవరం పంచాయతీ శివారు ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ప్రత్యేకంగా లేఅవుట్ వేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రాజకీయాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా 216 మందికి స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేశారు. ప్రస్తుతం 70 శాతంపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కాలనీలో రూ.5 లక్షలతో ప్రత్యేకంగా బోర్లు తవ్వించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సర్వాంగ సుందరంగా వీధి రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే గణేష్ ఇక్కడ కాలనీని పరిశీలించి తమ హయాంలో కొత్తగా కాలనీ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు.

తండ్రీ తనయుడితో గ్రామాభివృద్ధి



దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నాతవరానికి వన్నె తెచ్చే విధంగా పలు అభివృద్ధి పనులు చేశారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తున్నారు.

– గొలగాని రాణి, సర్పంచ్, నాతవరం

ప్రజల ఆశలు నెరవేర్చుతున్నాం...



నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా 2013 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో నాతవరం సర్పంచ్‌తోపాటు 14 వార్డు మెంబర్లను ఇక్కడ ప్రజలు గెలిపించారు. అప్పట్లో పంచాయతీ అభివృద్ధికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సర్పంచ్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. 2021 సర్పంచ్ ఎన్నికల్లో మరలా క్లీన్‌స్వీప్ చేశాం. రెండు పర్యాయాలు టీడీపీ మద్దతుదారులకు డిపాజిట్లు దక్కకుండా పట్టం కట్టారు. ప్రజలు నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమంతోపాటు అభివృద్ధి చేస్తున్నాం. ఇటీవల డిప్యూటీ సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలతో రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశాం.

– కరక అప్పలరాజు, ఉప సర్పంచ్, నాతవరం

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఇటీవల కలెక్టరు స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించారు.

– జోగారావు, హౌసింగ్ జేఈ, నాతవరం మండలం

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

- అనకాపల్లి జిల్లా వనరుల శాఖ వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్


పచ్చిరొట్ట ఎరువుల ఉపయోగాన్ని రైతులకు వివరిస్తున్న శ్రీధర్

కె.కోటపాడు: విత్తనశుద్ధి చేయడం వల్ల పంటకు తెగుళ్ల సోకే సమస్య ఉండదని అనకాపల్లి జిల్లా వనరుల శాఖ వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్ అన్నారు. వారాడలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి నారుమడి యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. సూడోమోనాస్ మందుతో విత్తనశుద్ధి చేయడంతోపాటు పొలంలో పశువుల గెత్తం వినియోగించడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. తద్వారా మంచి దిగుబడిని పొందవచ్చునని సూచించారు. పొలంలో పశువుల గెత్తంను వేసే పద్ధతిని చేసి చూపించారు. పచ్చిరొట్టను భూమిలో కలియ దున్నడం వల్ల సారవంతంగా మారుతుందని తెలిపారు. ఏవో సోమశేఖర్, పొలంబడి రిసోర్స్ పర్సన్ చిరంజీవి, విజేత, తులసీమణి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

చర్చకు వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం


జె.నాయుడుపాలెం సర్పంచ్ సమస్యకు వివరణ ఇస్తున్న తహసీల్దార్ వరహాలు

రోలుగుంట: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో పాలనాధికారి లక్ష్మి, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల వారీగా అభివృద్ధిపై చర్చించారు. దీనిలో భాగంగా కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రాజును నిలదీశారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో పేదోళ్లు, పెద్దోళ్లు అనే తారతమ్యం లేకుండా రోగులందరికీ వైద్యం అందించాలన్నారు. తాతల కాలం నాటి భూములు సాగు చేసుకుంటున్నా, కొన్ని సర్వే నంబర్లలో భూమి నమోదు కాలేదని, కొన్నేళ్లుగా కంచుగుమల దేవుని మాన్యం భూ సమస్య మండల సమావేశాల్లో చర్చకు వచ్చినా పరిష్కారం కాలేదని తహసీల్దార్ కె.వరహాలు బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఇటువంటి సమస్యపై జేసీ పరిశీలన తప్పదని, తమ స్థాయిలోది కాదన్నారు. పనసలపాడు రెవెన్యూలో సాగుదారులకు పట్టాభూములు ఇవ్వలేదని, పేదల భూములపై పెద్దోళ్ల కన్ను అని, ఇటీవల కొన్ని పత్రికల్లో (సాక్షిలో కాదు) శీర్షికలు రావడం సరికాదన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు టైటిల్ డీడ్, డాక్యుమెంట్లు ఉంటేనే ఇవ్వగలమన్నారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలపై అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవికిరణ్, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, ఎంపీటీసీలు రామన్, ఉలబాల సత్యవతి, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సామాన్యులకు బతుకు బాట

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి


ఒమ్మలిలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు సామాన్యులకు బతుకు బాట చూపిస్తున్నాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒమ్మలిలో ఇంటింటా తిరిగారు. నాలుగేళ్లలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. గ్రామ సచివాలయం పరిధిలో 20 రకాల సంక్షేమ పథకాల ద్వారా 15,31,57,908 కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చామని వివరించారు. 101 మందికి రూ.1.81 కోట్లతో ఇళ్లు మంజూరు చేశామన్నారు. రూ.2 కోట్లతో జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి సదుపాయం కల్పిస్తామన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. బొద్దాపు వారి కళ్లాల నుంచి పొలాలకు వెళ్లే ఒమ్మలి తాచేరు నది దగ్గర రోడ్డు పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో రూ.17.66 లక్షలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.47.58 లక్షలతో చేపట్టిన నాడు- నేడు అభివృద్ధి పనులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. గర్భిణులను ఆశీర్వదించారు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపిపిలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మా, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు సత్యవతి, హరికృష్ణ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవిరావు, కృష్ణమూర్తి, స్కూలు కమిటీ చైర్మన్ ఉగ్గిన అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరక్టరు బొద్దాపు దేముడు నాయుడు, పఠె ఏసుబాబు, కాతా వెంకటరమణ, నాయకులు కోట్ని శ్రీరామూర్తి, కోరుకొండ చెల్లం నాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, గొల్లవిల్లి రాజేశ్, పడాల అప్పలనాయుడు, రాఖీ శ్రీను, కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, కాళ్ల శ్రీనువాసరావు, ఆడారి గణేశ్, రాజుతాత, వెలగాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

- తెనుగుపూడిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ నేడు

దేవరాపల్లి: తెనుగుపూడిలో శనివారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే వైఎస్సార్ జయంతి వేడుకుల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఇందులో భాగంగా దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులర్పిస్తారన్నారు. అంతకు ముందు ముషిడిపల్లిలో సచివాలయ భవనాన్ని, కాశీపురంలో ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను, తెనుగుపూడిలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను కలెక్టర్ రవి పటాన్‌శెట్టితో కలిసి ప్రారంభిస్తారన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో అన్ని గ్రామాల్లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు, పేదలకు దుస్తుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.

మాడుగుల: మండలంలో వైఎస్సార్ జయంతి జయంతి వేడుకలు శనివారం ఉదయం ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా పాల్గొని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

చీడికాడ: వైఎస్సార్ జయంతి వేడుకులను చీడికాడలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్దకు ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జగనన్న పాలనలోనే అధిక సంక్షేమ లబ్ధి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ


సర్పంచ్, ఎంపీపీలతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: కొవ్వూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి గ్రామస్తులు నీరాజనాలు పలికారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జై అని, ధర్మశ్రీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఇక్కడ ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందనకు మురిసిపోయిన ధర్మశ్రీ ఉత్సాహంగా ఇంటింటా తిరిగారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమాలు సంబంధించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేస్తూ అధికారులను ఆదేశించారు. గత టీడీపీ పాలన కంటే అధిక సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంతో మలసాలడ భాస్కరరావు, చెట్టుపల్లి వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకుడు యర్రంశెట్టి రాజారావులను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవికిరణ్, ఆర్ఐ రామ్మూర్తి, ఏఈలు ప్రేమానందం, రాజు, పార్టీ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, తమటపు సత్యంనాయుడు, మడ్డు అప్పలనాయుడు, పోతల రాజశేఖర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే 'సురక్ష' లక్ష్యం


నర్సీపట్నం: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: అర్హులకు లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీ 12వ వార్డు 7వ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 580 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీనువాసరావు, తహసీల్దార్ అన్నాజీరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా పాల్గొన్నారు. మండలంలో చెట్టుపల్లి గ్రామ సచివాలయం -2లో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి 11 రకాల సర్టిఫికేట్లు అందజేశారు. ఎంపీడీవో జయమాధవి, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, మండల సచివాలయ కన్వీనర్ శానపతి వెంకటరత్నం పాల్గొన్నారు.

కె.కోటపాడు: జగనన్న సురక్షలో భాగంగా గొండుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో 295 మందికి, గుల్లేపల్లిలో 154 మందికి ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సర్పంచ్‌లు బండారు కనకమల్లీశ్వరి, బండారు దేముళ్లు, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, బండారు లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: బూరుగుపాలెం, లచ్చన్నపాలెం గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు సుమారు 1,300 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు పెట్ల భద్రాచలం, భీమిరెడ్డి గోవింద, బొడ్డు నాయుడు, పోతల వెంకునాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: ఏఎల్‌పురం-2 గ్రామ సచివాలయంలో 874 మంది లబ్ధిదారులకు నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, తహసీల్దార్ ఆనందరావు, ఈవోఆర్‌డీ రఘు, సర్పంచ్, ఎంపీటీసీ లోచల సుజాత, చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్: స్థానిక గ్రామ సచివాలయం -2లో 485 మందికి ఎంపీపీ వేమవరపు రామధర్మజ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కింతలి వల్లాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి 350 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి, ఉప సర్పంచ్ వంటాకు గోవింద, ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, సీతారామయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి సామన్నదొర పాల్గొన్నారు.

రావికమతం: జగనన్న సురక్షలో భాగంగా కొత్తకోట-2లో 856, గర్నికంలో 712 అర్జీలను పరిష్కరించి ధ్రువపత్రాలందించారు. సర్పంచ్ కోన లోవ రాజు, ఉప సర్పంచ్ పందల దేవా, గర్నికం సర్పంచ్ కేశంశెట్టి రాము, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ పాల్గొన్నారు. నాయకురాలు జాలిపర్తి అమ్మాజి, మాజీ ఉప సర్పంచ్ గున్నాజిరావు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన తప్పనిసరి


పలు అంశాలపై వివరిస్తున్న శ్రీనివాసరావు

నాతవరం: రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కుల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం సబ్ డివిజనల్ క్రైమ్ స్పాట్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. వెన్నలపాలెం జీడి పిక్కల ఫ్యాక్టరీలో మహిళలకు కేజీబీవీలో బాలికలకు శుక్రవారం వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయంలో 100, 112 నంబర్లను సంప్రదించాలన్నారు. ఇటీవల చోరీలు, మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ భవాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేసి తీరుతాం

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్


నర్సీపట్నం: పట్టణంలోని రోడ్డు విస్తరణ చేసి తీరుతామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పెద బొడ్డేపల్లి 12వ వార్డులో ఇంటింటా తిరిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల కొంత మందికి నష్టం వాటిల్లినప్పటికీ వేలాది మందికి అవసరమని భావించి తామంతా వందడుగులకు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేశామన్నారు. లీగల్ పరంగా కానీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డైరెక్షన్‌తో రోడ్డు విస్తరణ ఆగితే ఆగవచ్చన్నారు. అంతే తప్ప రోడ్డు విస్తరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదన్నారు. అనంతరం వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించాలన్నారు. వార్డు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బేతిరెడ్డి రత్నం, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ అర్జున్, ఏఎంసీ డైరెక్టర్లు సమ, లోకవరపు శారద, పార్టీ నాయకులు చిటికెల కన్నబాబు, గంటా లలిత, కొణతాల వరలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


నినాదాలు చేస్తున్న నాయకులు

మాడుగుల రూరల్/మాడుగుల: కె.జె.పురంలో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను మండల శాఖ అధ్యక్షుడు బెన్నవోలు పరిదేశినాయుడుమాదిగ ఆవిష్కరించారు. నాయకులు చిన్నం పెంటయ్య, బెన్నవోలు దేముళ్లు, చిన్నం పరిదేశి, ఎంపీటీసీ చిన్నం లోవ, చిన్నం రాము, చిన్నం కొండబాబు పాల్గొన్నారు. ఒమ్మలిలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలుసూరి ఘాటీలు మాట్లాడారు. పోరాట సమితి ద్వారా మాదిగ ఉప కులాలకు ప్రభుత్వ ఫలాలు అందాయన్నారు. సభ్యులు ఎలకా రాజేష్, రావాడ ఈశ్వరరావు, చెవ్వేటి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నవధాన్యాలతో అన్ని రకాల పోషకాలు


బీజామృతం తయారీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: వ్యవసాయంలో ప్రకృతి పద్ధతులు అనుసరించాలని రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ తెలిపారు. గుండిపాలలో రైతులకు ఆయన బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు. తొలకరికి ముందే నవధాన్యాలతో ఈ విధానాన్ని అమలు చేయడం వల్ల భూమికి అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. దీనివల్ల పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని సూచించారు. సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ హేమ సుందర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్లు పాల్గొన్నారు.

వడపర్తిలో వైద్య శిబిరం


గిరిజనులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: వడపర్తి గిరిజన గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో రెండు రోజుల క్రితం ఒకరికి టీబీ రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ మేరకు గ్రామంలో గిరిజనులను పరీక్షించారు. సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు అశ్విని శైలజ, మధుసూదన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవం

మాడుగుల: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు సరఫరా చేయడానికి మాడుగులలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్ (సమీకృత వ్యవసాయ ప్రయోగశాల)ను శనివారం ఉదయం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించనున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఎంపీపీ, వైస్ ఎంపీపీ కోరారు.